క్లుప్తంగా

మెరుగైన సేవలందించండి



16వ సచివాలయం తనిఖీ చేస్తున్న కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోని టౌన్ : మున్సిపాలిటీ పరిధిలో వార్డు సచివాలయ సేవలు మరింతగా మెరుగుపరచాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఉద్యోగులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని 5, 6, 8 వార్డు సచివాలయాలను తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో ఉద్యోగుల హాజరుశాతం, పనితీరు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారంకాని సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. దరఖాస్తులను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. ఆస్తి, నీటి, చెత్త పన్ను వసూలు చేయడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

నేడు ఉరుకుందలో హుండీ ఆదాయం లెక్కింపు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజినేయులు, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ మంగళవారం తెలిపారు. హుండీ లెక్కింపును స్థానిక డార్మెంటరీ హాల్‌లో చేపడుతున్నట్లు వెల్లడించారు.దేవాలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనుల్ని మాస్టర్‌ప్లాన్ ప్రకారంగానే చేపట్టడానికి చర్యలు చేపట్టామన్నారు. భక్తులు విరివిగా విరాళాలు అందించి దేవాలయ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

అన్నదాన రుసుము రూ.30 వేలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయం వద్ద అన్నదానం చేయాలనుకునేవారు రూ. 30 వేలు చెల్లిస్తే తామే వారి పేరిటా కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజినేయులు, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఒక రోజు అన్నదానానికి రూ.30 వేలు నిర్ధారించామన్నారు. ఈ మొత్తాన్ని దేవాలయ కార్యాలయంలో చెల్లిస్తే ఆరోజు మొత్తం వారి పేరటే అన్నదానం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే అమావాస్య రోజు అన్నదానం చేయించుకోవాలనుకోనే వారు రూ.75వేల రూపాయల చెల్లిస్తే ఆరోజు మొత్తం అన్నదాన కార్యక్రమం వారి పేరున జరపబడుతుందని చెప్పారు.దేవాలయం వారు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

కౌతాళం: మండల కేంద్రంలోని సచివాలయం -2లో మంగళవారం సర్పంచ్ పాల్‌దినకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లదచారి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో కర్నూలు అమీలియా ఆసుపత్రి వైద్యులు రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 90 మంది కంటి పరీక్షలు చేయగా,50 మందికి ఆపరేషన్లు అవసరం కాగా వారిని కర్నూలుకు రెఫర్ చేశారు. వీరికి ఎమ్మెల్యే సహకారంతో కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని వైద్యుడు ఈరన్న తెలిపారు. అలాగే ఉచితంగా కంటి అద్దాల్ని కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మిగిత వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిక్కయ్య, నాయకులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఆదోని రూరల్: మండలంలోని నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళపై అదే గ్రామానికి చెందిన నలుగురు దాడి చేసిన సంఘటనలో కేసునమోదు చేసినట్లు ఇస్వీ ఏఎస్‌ఐ చంద్ర మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈనెల 23న తన పొలం వద్ద తెల్లనెత్తి ఈరన్న, అతని భార్య ఈరమ్మ, కొడుకు నరసింహులు, కోడలు సౌందర్య పొలం గట్టు విషయంలో గొడవ పడి తనపై దాడి చేసినట్లు బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు చెప్పారు.

సూక్ష్మ సేద్యంపై అవగాహన

కర్నూలు(అగ్రికల్చర్): 2023-24లో జిల్లాలో అవసరమైన రైతులందరికీ సూక్ష్మ సేద్యం కల్పించడంలో భా గంగా ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లకు అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు ఏపీఎంఐపీ శ్రీకారం చుట్టింది. జిల్లాలో 466 ఆర్‌బీకేలు ఉండగా ఉద్యాన అధికారులు మండలాల వారీగా వీటి ఇన్‌చార్జ్‌లకు ఈ నెల 25 నుంచి మే 3వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ ఏడాది 5 వేల హెక్టార్లకు సూక్ష్మ సేద్య సదుపాయం కల్పించే విధంగా ప్రభుత్వం లక్ష్యాన్ని ఇచ్చింది. బిందు, తుంపర్ల సేద్యానికి ఆర్‌బీకేల్లో ఏ విధంగా రిజిస్ట్రేషన్ చేయాలి. డాక్యుమెంటేషన్ అప్‌లోడ్ చేయడం ఎలా, నీటి లభ్యత, పంటల స్వభావం . నేల స్వభావం, విద్యుత్ సౌకర్యాం తదితర వాటిని బట్టి డిజైన్ ఏ విధంగా చేయాలి. ప్రాథమిక సర్వే చేసే విధానం తదితర వాటిపై ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లకు అవగాహన కల్పించారు.

విద్యార్థినులకు వరం.. 'బనవాసి' కాలేజీ

- నాణ్యమైన బోధనకు పెట్టింది పేరు బనవాసి ఏపీఆర్‌జేసీ
- దరఖాస్తుకు ఈ నెల 28 వ తేదీ వరకు గడువు పొడగింపు
- ప్రవేశ పరీక్ష మే 25న
- నాలుగు జిల్లాల విద్యార్థినులకు అవకాశం



బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీ క్రమశిక్షణకు, నాణ్యమైన విద్యాభోదనకు పెట్టింది పేరు. కాలేజీలో సీటు రావడం విద్యార్థినులు అదృష్టంగా భావిస్తారు, ఏపీ గురుకుల కాలేజీలో చదువుకున్న విద్యార్థినులు ఉన్నత విద్యలో రాణిస్తుందనే నమ్మకం మెండు. పేద విద్యార్థినులకు వరం లాంటిది బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీ. రాయలసీమ జిల్లాలైన కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల విద్యార్థినులకు ఇక్కడ రెండు సంవత్సరాలు విద్యాభోదన అందిస్తారు. ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధిస్తే సీటు వచ్చినట్లే. కాలేజీ ప్రవేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, క్రీడాకారులు, అనాథలు, ఎన్‌సీసీ క్యాడెట్లకు రిజర్వేషన్ కల్పిస్తారు. కాలేజీలో సీటు వచ్చిన విద్యార్థినులకు రెండు సంవత్సరాలు విద్యాభోదనతో పాటు హాస్టల్ వసతి కల్పిస్తారు.

ఆన్‌లైన్‌లో ధరఖాస్తు

ఇంటర్మీడియట్ ప్రవేశానికి పదవ తరగతి చదివిన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రవేశ పరీక్షకు రూ. 100లు చెల్లించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు htt pr//a prr.apcfrr.in వెబ్‌సైట్‌లో లభిస్తాయి.

ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థినీలు చూసుకోవాల్సింది

ప్రవేశ పరీక్షలు మంచి ర్యాంకు సాధించి సీటు సాధించాలి అంటే విద్యార్థినులు చూసుకోవాల్సిన అంశాలపై అప్రమత్తంగా ఉండాలి. పదవ తరగతి పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. గణితంలో 50, సైన్సులో 50, ఇంగ్లిష్‌లో 50 ప్రశ్నలు ప్రవేశ పరీక్షలో ఇస్తారు. పట్టదలతో చదివితే ర్యాంకు సులభంగా సాధించవచ్చు.

కాలేజీలో ఉండే సీట్లు

- బన వాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీలో బాలికలకు ఎంపీసీలో 60 సీటు, బైపీసీలో 40 సీట్లు, ఎంఈసీలో 30 సీట్లు ఉంటాయి.
- అనంతపురం జిల్లా కొడిగినహళ్లిలో బాలురకు ఎంఈసీ, ఎంపీసీ, సీఈసీ, బైపీసీ కోర్సులు ఉంటాయి.
- చిత్తూర్ జిల్లాలో గారేంపల్లిలో బాలురకు బైపీసీ, సీఈసీ, ఎంపీసీ, ఎంఈసీ కోర్సులు ఉంటాయి.

దరఖాస్తు ... ప్రవేశ పరీక్ష తేదీలు

కాలేజీలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్ష కోసం ఈనెల 28వ తేదిలోపు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకు 12.5.2023న హాల్ టికెట్స్ అందజేస్తారు. ప్రవేశ పరీక్ష 20.5.2023న (మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల) వరకు ఉంటుంది. ప్రవేశ పరీక్ష ఫలితాలను 8.6.2023న విడదల చేస్తారు. ర్యాంక్ సాధించిన విద్యార్థినులకు కౌన్సెలింగ్ 15.6.2023న నిర్వహిస్తారు.

బాలికలకు మంచి అవకాశం



రాయలసీమలోని నాలుగు జిల్లా విద్యార్థినులకు ఇదో మంచి అవకాశం. కాలేజీలో సీటు వస్తే రెండు సంవత్సరాలు బోధన అందిస్తాం. ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంకుల ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఆన్‌లైన్‌లో ఈ నెల 28 తేదీ వరకు గడపు పొడగించారు. కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూర్ జిల్లాలకు చెందిన బాలికల మాత్రమే ప్రవేశం ఉంటుంది. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డా. జయం శ్రీనివాసగుప్త, ప్రిన్సిపాల్ ఏజీఆర్‌జేసీ బనవాసి.

అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

- తల్లీబిడ్డ క్షేమం



శిశువును చూపుతున్న ఈఎంటీ రంగస్వామి

ఆలూరు రూరల్: ఓ గర్భిణి అంబులెన్స్‌లోనే పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. హొళగుంద మండలం నెరణికి గ్రామానికి చెందిన నిండు గర్భిణి లక్ష్మికి మంగళవారం మధ్యాహ్నం పురిటి నొప్పులు రావడంతో భర్త లక్ష్మన్న 108 ఫోన్ చేశాడు. ఆలూరు 108 అంబులెన్స్ నెరణికి గ్రామానికి చేరుకుని గర్భిణిని హొళగుంద ప్రైమరీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు ఎక్కువై ఆడ బిడ్డను ప్రసవించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ రంగస్వామి తెలిపారు. హొళగుంద ఆస్పత్రిలో చేర్పించినట్లు చెప్పాడు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

చిప్పగిరి: ఇప్పటివరకు రైతు భరోసా సాయం అందని రైతులు ఎవరైనా ఉంటే ఈనెల చివరిలోపు ఆయా గ్రామాల రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని ఏఓ ఆనంద్ సూచించారు.మంగళవారం ఆయన మాట్లాడు తూ రైతుకు పెట్టుబడి సాయం కింద ఏటా మూడు విడతల్లో మొత్తం రూ.13,500 ప్రభుత్వం అందజేస్తుందన్నారు.

వైఎస్సార్‌సీపీ వైపే ప్రజలు



కరపత్రాలను ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు:ప్రజలు వైఎస్సార్‌సీపీవైపే ఉన్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన జగనన్నే మా భవిషత్ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 7వ తేదీ నుంచి చేపట్టిన జగనన్నే మా భవిషత్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో 60 వేల కుటుంబాలను కలిసినట్లు తెలిపారు. ఏ గడప తొక్కినా, ఎవరిని తట్టినా జగనన్నే మా నమ్మకం అని, అంతా వైఎస్సార్ సీపీ వైపే మొగ్గు చూపుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో ప్రజలంతా మా భవిషత్ నీవే జగనన్న అనే నినాదంతో ముందుకు వెళ్లుతున్నారన్నారు. సర్వేకు వస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు తెల్లబోయిన ముఖాలతో ఉలిక్కి పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మ్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, రవిచంద్రరెడ్డి, గజేంద్రరెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, దేవదానం, పరమేష్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- సంతెకూడ్లూరులో కొనసాగిన 'గడపగడపకు మన ప్రభుత్వం'



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్: పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. 90 శాతానికి పైగా హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మంగళవారం సంతెకూడ్లూరు గ్రామంలో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని కొనసాగించారు.ప్రతి ఇంటి గడప ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. నవరత్నాలు ప్రజలకు అందుతున్నాయా లేదా మీ సమస్యలు ఏమిటి,ఇక్కడ మంచినీరు, వీధిదీపాలు, డ్రెయినేజీ, రోడ్లు సమస్యలు ఏవైనా ఉన్నాయా అని ప్రజలను అడిగారు. ఎండను కూడా లెక్క చేయకుండా తిరుగుతూ ప్రజలతో మమేకమై ముందుకు కదిలారు.

గ్రామంలో అభివృద్ధి పనులకు ఆదేశం

సంతెకూడ్లూరు గ్రామంలో సచివాలయం నిధులు రూ.20 లక్షలతో డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఎక్కువగా డ్రైనేజీ,సీసీ రోడ్ల సమస్య ఉందని, కావు న గ్రామాలు అన్ని చోట్ల రోడ్లు, డ్రైనేజీలకు రూ. కోటి మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలని ఎంపీపీకి సూచించారు. ప్రజలు విద్యుత్ స్తంభాలు లేవని అడిగిన వెంటనే ఆ గ్రామానికి 15 విద్యుత్ స్తంభాలను మంజూరు చేయించారు. తాగడానికి నీరు లేవని నీటి సమస్యను మహిళలు వివరించగా, వెంటనే బీసీ కాలనీలో రూ.5 లక్షలతో పైపులైన్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారి నాగమల్లయ్యను ఎమ్మెల్యే ఆదేశించారు. అలాగే జలజీవన్‌మిషన్ పథకం నిధులతో ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని గ్రామ ప్రజలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు మంజుల, రేణుక, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మండల ఎంపీపీ బడాయి దానమ్మ, పంపాపతి, గ్రామ సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీ కనకమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాపరెడ్డి, బ్రదర్స్ నాగరాజు, మధు, వీరభద్రప్ప, నకతే శ్యామ్, వేణుగోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శ్రీలక్ష్మి, కల్పవల్లి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు ఘన సన్మానం

ఆదోని రూరల్ : జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని మేజర్ పంచాయతీ మండిగిరి రాష్ట్ర స్థాయిలో అవార్డు సొంతం చేసుకుంది. ఇందులో భాగంగా మండిగిరి స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ గీతావాణి ఉత్తమ రాష్ట్ర అవార్డును విజయవాడలో అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది మంగళవారం సాయంత్రం ఆమెను పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జనార్దన్, సీనియర్ పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ వీరభద్రప్ప, ఏఓ రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ గీతావాణిని సన్మానిస్తున్న సిబ్బంది

ప్రభుత్వ వైద్యుల అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు

కర్నూలు(హాస్పిటల్): తమ సమస్యల పరిష్కా రం కోసం, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకుగాను ప్రభుత్వ వైద్యులు అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వారు సమావేశమై కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.కమిటీ కన్వీనర్లుగా డాక్టర్ రామశివనాయక్, డాక్టర్ బ్రహ్మాజీ మాస్టార్, సభ్యులుగా డాక్టర్ సునీల్ కుమార్‌రెడ్డి, డాక్టర్ విజయానందబాబు, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్ట ర్ మాధవీశ్యామల, డాక్టర్ రామకృష్ణనాయక్, డాక్టర్ సోమప్ప, డాక్టర్ శారద, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ సలీంబాషా ఎన్నికయ్యారు.

లోకేష్ పాదయాత్రతో ప్రజలకు ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణ గౌరవ అధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి

ఆదోని అర్బన్: ఆదోని నియోజకవర్గంలోని పెండేకల్ నుంచి పెద్దతుంబళం వరకు నాలుగు రోజుల పాటు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రతో ప్రజలకు ఒరిగిందేమీ లేదని, పాదయాత్ర అట్టర్‌ప్లాఫ్ అయ్యిందని వైఎస్సార్ సీపీ పట్టణ గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాదయాత్ర అంటే ప్రజల సమస్యలను తెలుసుకొని, ఈ ప్రభుత్వంలో చేయని పనులను తమ ప్రభుత్వంలో చేస్తామని హామీ, ధైర్యం ఇవ్వడమన్నారు. కానీ లోకేష్ ఇవేమి లేకుండా ముందుకెళ్లడం పై విమర్శలు వెల్లువెత్తాయన్నారు. ఎవరో స్క్రిప్టు రాసిస్తే గానీ యాక్షన్ చేయడం తప్ప నారా లోకేష్‌కు ఏమీ రాదన్నారు. అంతేగాకుండా ఎంపిక చేసిన వారి సమస్యలు వినడం, సమాధానం చెప్పడం అంతా వారి స్క్రిప్టు ప్రకారమే జరుగుతోందని విమర్శించారు. డివిజన్ పరిధిలో అన్ని నియోజకవర్గాల్లోని అధికార పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలపై అవాస్తవమైన ఆరోపణలు చేయడం తప్పా చేసిందేమీ లేదన్నారు. పట్టణంలో ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై కూడా నిజానిజాలు తెలుసుకోకుండా లోకల్ నాయకులు ఇచ్చిన స్క్రిప్టు చదవడం, వారిని బాధపెట్టడం తప్ప పాదయాత్ర ద్వారా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలందించండి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): గ్రామీణ, పట్టణ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య ఆదేశించారు.ఆయన మంగళవారం తనఛాంబర్‌లో జిల్లా ప్రోగ్రాంఅధికారులతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. పీహెచ్‌సీలు, పట్టణ పీహెచ్‌సీలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను సందర్శించి అన్ని జాతీ య ఆరోగ్య కార్యక్రమాల ప్రగతిని సమీక్షించాలని ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎం యాప్‌లలో ఆరోగ్య సేవల వివరాలను నమోదు చేయాలని, ఎప్పటికప్పుడు తగు సూచనలు చేస్తూ పర్యవేక్షణ చేయాలన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఐరన్ మాత్రలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైద్యాధికారు లు వారి పరిధిలోని హాస్టళ్లను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య సేవలు అందించాలని, గర్భవతులు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి రక్తహీనత కలిగిన వారికి తగిన చికిత్స అందించి, వివరాలను అనీమియా మానిటరింగ్ టూల్‌లో పొందుపరచాలని సూచించారు. డీటీసీఓ డాక్టర్ భా స్కర్, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్,ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, డీపీఎంఓ డాక్టర్ ఉమ, ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ హేమలత, ఎఫ్‌పీసీ నోడల్ అధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ, మలేరియా అధికారి నూకరాజు, డీపీహెచ్‌ఎన్‌ఓ ఇందిర,ఎస్‌ఓ హేమసుందర్, డీపీఓ విజయరాజు,డెమో శ్రీనివాసులు పాల్గొన్నారు.

శుభ్రతతోనే మలేరియా నివారణ

పరిసరాల పరిశుభ్రతతో మలేరియా వ్యాధిని నివారించవచ్చని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డ య్య అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం స్థానిక డాక్టర్స్ కాలనీలోని రాయలసీమ నర్సింగ్ కాలేజీలో మలేరియా నివారణ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డీహెచ్‌ఎంఓ మాట్లాడుతూ.. చలి జ్వరం, తలనొప్పి ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రాత్రి నిద్రించేటప్పుడు దోమతెరలు వాడాలన్నారు. దోమలు ఉత్పత్తి అయ్యే ప్రాంతాలను గుర్తించి యాంటి లార్వా ఆపరేషన్ చర్యలు నిర్వహించాలని ఆదేశించారు.

జిల్లా జ్యోతిష్యుడి ఘనత



సింగపూర్‌లో జ్యోతిష్య శాస్త్రవేత్తల సమ్మేళనంలో సన్మానం అందుకుంటున్న భానుప్రకాష్ శర్మ

కర్నూలు కల్చరల్: సింగపూర్‌లో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు జరిగిన ప్రపంచ జ్యోతిష్య శాస్త్రవేత్తల సమ్మేళనంలో రాష్ట్రం నుంచి కర్నూలుకు చెందిన డాక్టర్ భానుప్రకాష్ శర్మ హాజరయ్యారు. నాలుగు రోజుల పాటు సింగపూర్‌లో అంతర్జాతీయంగా వచ్చిన శాస్త్రవేత్తలు జ్యోతిష్య శాస్త్రంలో మార్పులపై చర్చించారు. కర్నూలు కొత్తపేట ఆంజనేయ స్వామి గుడిలో పూజారిగా ఉన్న భానుప్రకాష్ శర్మ జ్యోతిష్య శాస్త్రంలో ఎంఏతో పాటు డాక్టరేట్ డిగ్రీ సాధించారు. ఈ సందర్భంగా టీజీవీ కళాక్షేత్రంలో కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. త్వరలో మరో అంతర్జాతీయ సమ్మేళనానికి హాజరు కానున్నట్లు భానుప్రకాష్ శర్మ పేర్కొన్నారు.

కుతంత్రాలకు పుట్టినిల్లు 'టీడీపీ'

- మంత్రి గుమ్మనూరు జయరాం



గుమ్మనూరులో గంగమ్మ పూజ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: కుట్రలు, కుతంత్రాలకు తెలుగుదేశం పార్టీ పుట్టినిల్లు అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఎద్దేవా చేశారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన టీడీపీ నాయకులు పనికట్టుకుని అసత్యారోపణలు చేస్తున్నారని, ఉనికిని కాపాడుకునేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిరంతరం బురదజల్లుతున్నారని విమర్శించారు. చిప్పగిరి మండలం గుమ్మనూరు గ్రామంలో జరుగుతున్న శ్రీ బస్వేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా మంగళవారం గంగమ్మ పూజా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. అయితే ఓర్వలేని టీడీపీ నాయకులు పసలేని, అసత్యారోపణలు చేస్తున్నారని, ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని హెచ్చరించారు. ప్రత్యేకించి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అర్థరహితంగా మాట్లాడాన్ని ప్రజలు తప్పుపడుతున్నారన్నారు. తనతండ్రి చంద్రబాబు చేసిన అభివృద్ధిని వివరించకుండా వైఎస్సార్‌సీపీని విమర్శంచేందుకే వచ్చామన్నట్లుగా లోకేష్ తీరు ఉందని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేలకు వివిధ రకాలుగా పేర్లు పెట్టి పిలువడం లోకేష్ మూర్ఖత్వాన్నికిని నిదర్శనమన్నారు. ప్రజల వద్దకు నేరుగా ఎమ్మెల్యేలు, మంత్రులు వెళ్తున్న ప్రభుత్వం మాదని, ప్రజలతో నేరుగా మమేకమవుతూ సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామనే విషయాన్ని టీడీపీ నాయకులు మరిచిపోయినట్లు ఉన్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ పాలనలో ఎప్పుడైనా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారా అని ప్రశ్నించారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న తేడా ప్రజలకు తెలుసని, ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రయోజనం లేదనే విషయాన్ని లోకేష్ గుర్తించుకుంటే బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మెన్ శ్రీ నివాసులు, గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, మండల కన్వీనర్ నారాయణ, మంత్రి తల్లిదండ్రులు బసప్ప, మాజీ సర్పంచ్ శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడుల సాధనకు కృషి చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన, హాజరైన అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్):తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించే విధంగా రైతులకు సాగులో మెలకువలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆర్‌బీకేల ద్వారా రైతులకు అన్ని రకాల సేవలను అందుబాటులోకి తేవాలని సూచించారు. వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, మత్స్యా శాఖ, ఏపీఎంఐపీ, పట్టు పరిశ్రమ శాఖల ద్వారా అమలవుతున్న పథకాల గురించి ఆరా తీశారు. అన్ని పథకాలను రైతుల్లోకి తీసుకెళ్లి సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలన్నారు. జిల్లాలో చిరుధాన్యాల సాగు, వినియోగాన్ని ప్రోత్సహించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఖరీఫ్‌లో సబ్సిడీపై విత్తనాల పంపిణీకి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. 2023-24లో సూక్ష్మ సేద్యాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నారు. ఫిష్ ఆంధ్ర ద్వారా అన్ని రకాల చేపలను ప్రజలకు అందుబాటులోకి తేవాలని, లక్ష్యం మేరకు ఫిష్ వెండింగ్ యూనిట్లు నెలకొల్పాలని సూచించారు. పశు విజ్ఞాన బడులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కూరగాయలు, పండ్ల తోటల సాగు దిశగా రైతులకు ప్రోత్సహించాలన్నారు. డీఏఓ పీఎల్ వరలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు, మత్స్యాశాఖ అధికారి శ్యామల, పశుసంవర్ధక శాఖ జేడీ రామచంద్రయ్య, పట్టు పరిశ్రమ శాఖ అధికారి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

30న ఏపీజీఈఏ సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా ఈ నెల 30న రాజమహేంద్రవరంలో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) విస్తృత సమావేశం నిర్వహిస్తోందని జిల్లా శాఖ అధ్యక్షుడు బంగి శ్రీధర్ తెలిపారు. ఆనం కళాక్షేత్రంలో జరిగే ఈ సమావేశానికి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఏపీజీఈఏ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు, పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం, శాఖాపరమైన సంస్కరణలు తదితర వాటిపై రాష్ట్ర నాయకత్వం సమగ్రంగా చర్చించనుందని తెలిపారు. దీని ఆధారంగా భవిష్యత్ ప్రణాళికను సిద్ధం చేస్తామని పేర్కొన్నారు.